
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
ఆదివారం 17 మార్చి 2024



పైపులైను ఏర్పాటు

రుద్రంగి, మార్చి 16: మండలంలోని మానాలలో నీటి సమస్యను తీర్చడం కోసం నూతన పైపులైను ఏర్పాటు చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఓబీసీ సెల్ జనరల్ సెక్రెటరీ జక్కు వంశీ అన్నారు. శనివారం మానాలలో ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి ఐదు లక్షలతో పనులకు భూమిపూజ చేశారు. వైస్‌ఎంపీపీ పిసరి చిన్నభూమయ్య, జక్కు మోహన్, రమేష్, దిలీప్ పాల్గొన్నారు.





- మే 13న పోలింగ్
- జూన్ 4న కౌంటింగ్
- జిల్లాలో 4.70 లక్షల మంది ఓటర్లు
- సిరిసిల్ల, వేములవాడ సెగ్మెంట్లలో మొదలైన సందడి

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

షెడ్యూల్ వెలువడడంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో లోక్‌సభ ఎన్నికల వేడి మొదలైంది. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఉన్న సిరిసిల్ల, వేములవాడ సెగ్మెంట్లలో ఎన్నికల సందడి మొదలైంది. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన గతంలో పోటీ చేసిన వారు, చిన్న చిన్న పార్టీ నేతలు మరోసారి లోక్‌సభ బరిలో నిలవడానికి సంసిద్ధులు అవుతున్నారు. శనివారం షెడ్యూల్ విడుదల కావడంతోనే కోడ్ అమల్లోకి వచ్చింది. నగదు, ఉల్లంఘనలపై నిఘా మొదలైంది. ఏప్రిల్ 18న నోటిఫికేషన్ వెలువడనుంది. ఏప్రిల్ 25 వరకు నామినేషన్ల స్వీకరణ, 26న నామినేషన్ల పరిశీలన, 29 వరకు ఉపసంహరణలకు అవకాశం ఉంది. మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపుతో అభ్యర్థుల భవితవ్యం వెలువడనుంది. సిరిసిల్ల, వేములవాడ సెగ్మెంట్లలో ఇప్పటికే అధికారయంత్రాంగం ఎన్నికలకు సర్వం సిద్ధం చేసింది. పోలింగ్ సామగ్రిని సమకూర్చుకుంది. ఈవీఎంలను భద్రపరచడమే కాకుండా ర్యాండమైజేషన్ కూడా చేశారు.

● జిల్లాలో 537 పోలింగ్ కేంద్రాలు..

లోక్‌సభ ఎన్నికల కోసం తుది ఓటరు జాబితా వెల్లడించారు. సిరిసిల్ల, వేములవాడ రెండు సెగ్మెంట్లకు సంబంధించి నాలుగు లక్షల 70 వేల 759 మంది ఓటర్లు ఉన్నారు. మెత్తం 537 కేంద్రాలు ఏర్పాటు చేశారు. సెగ్మెంట్లలో ఎన్నికల సమయంలో ఒకే ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు వేర్వేరు పోలింగ్ బూత్‌ల్లో ఓట్లు వేసే పరిస్థితులు లేకుండా ఒకే పోలింగ్ కేంద్రానికి మార్చారు. పోలింగ్ కేంద్రాల్లో 1,500 మంది ఓటర్లకు మించి ఉండకుండా చర్యలు చేపట్టారు. రెండు సెగ్మెంట్లలో 4,70,759 మంది ఓటర్లు ఉండగా పురుషులు 2,26,912 మంది, మహిళలు 2,43,808 మంది, 39 మంది జెండర్ ఓటర్లు ఉన్నారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రకారం 4,67,438 ఓటర్లు ఉండగా స్వల్పంగా ఓటర్లు పెరిగారు. 321 మంది పెరుగుదల ఉంది. ప్రస్తుతం వేములవాడ సెగ్మెంట్‌లో 2,25,211మంది ఓటర్లు ఉండగా పురుషులు 1,07,618 మంది, మహిళలు 1,17,561మంది జెండర్లు 32 మంది ఉన్నారు. సిరిసిల్ల సెగ్మెంట్‌లో 2,45,548 మంది ఉండగా పురుషులు 1,19,294 మంది, మహిళలు 1,26,247 మంది, జెండర్లు ఏడు మంది ఉన్నారు. రెండు సెగ్మెంట్లలో సర్వీస్ ఓటర్లు 160 మంది ఉండగా వేములవాడలో 56 మంది, సిరిసిల్లలో 104 మంది ఉన్నారు. రెండు సెగ్మెంట్లలో మహిళ ఓటర్లే అధికంగా ఉన్నారు. సిరిసిల్ల, వేములవాడ సెగ్మెంట్లలో 4,70,759 మంది ఓటర్లు ఉండగా మహిళలు అధికంగా 16,896 మంది ఉన్నారు. వేములవాడ సెగ్మెంట్‌లో 2,25,211మంది ఓటర్లు ఉండగా మహిళలు 9,943 మంది, సిరిసిల్ల సెగ్మెంట్‌లో 2,45,548 మంది ఓటర్లు ఉండగా మహిళలు 6,953 మంది అధికంగా ఉన్నారు.

● ఎన్నికలపై పార్టీల దృష్టి

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ రావడంతో సిరిసిల్ల, వేములవాడ రెండు సెగ్మెంట్లలో జాతీయ పార్టీలు పట్టు సాధించడానికి ఇప్పటికే ప్రచారం మొదలు పెట్టారు. బీజేపీ అభ్యర్థి సిటింగ్ ఎంపీ బండి సంజయ్ ప్రజాహిత యాత్ర పేరిట జిల్లాలో పర్యటించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి మాజీ ఎంపీ వినోద్‌కుమార్, బీఆర్‌ఎస్ మండల స్థాయి సమావేశాలు నిర్వహించారు. మాజీ మంత్రి కేటీఆర్ పార్లమెంట్ సన్నాహక సమావేశాలు పూర్తి చేశారు. కాంగ్రెస్‌కు సంబంధించి ఈసారి వేములవాడ నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఉండడంతో కాంగ్రెస్ ఓటు బ్యాంక్‌పై ఆసక్తి పెరిగింది. కాంగ్రెస్ అభ్యర్థిపై ఇంకా స్పష్టత లేకపోవడంతో రెండు సెగ్మెంట్లలో ఉత్సాహం పెరగలేదు. స్వతంత్ర అభ్యర్థులుగా కూడా పోటీకి పలువురు సిద్ధమవుతున్నారు.


ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



భారత ఎన్నికల కమిషన్ పార్లమెంట్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేసిందని ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని నిబంధనలు పాటించాలని కలెక్టర్, ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి కోరారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో ఎస్పీ అఖిల్‌మహాజన్‌తో కలిసి ఎన్నికల నిర్వహహణపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు సరిచూసుకోవాలని, ఏప్రిల్ 15 వరకు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. రాజకీయ పార్టీలు నాయకులకు సమావేశాలు నిర్వహించుకునేందుకు సింగిల్ విండో సిస్టమ్ ద్వారా అనుమతులు అందిస్తామని, ముందు ఎవరూ దరఖాస్తు చేసుకుంటే వారికి అనుమతి ఉంటుందని అన్నారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు మైక్‌లు, స్పీకర్‌లు వినియోగించుకోవడానికి వీలు లేదన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియామళిపై ఉల్లంఘనకు వచ్చే ఫిర్యాదులను పరిశీలించేందుకు జిల్లాలో ఎంసీసీ సర్వేలెన్స్ బృందాలను, ఫ్లయింగ్ స్క్వాడ్, ఎంసీఎంసీ కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియామావళిపై ఫిర్యాదులను ప్రజలు 1950 టోల్ ఫ్రీ నంబర్, సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులు చేయవచ్చని అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో 24 గంటల కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్‌రైటింగ్, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, ఫోటోలను ప్రభుత్వ కార్యాలయాల్లో 24 గంటల వ్యవధిలో, బస్టాండ్, పెట్రోల్ బంక్, మొదలైన ప్రజాస్థలాల్లో 48 గంటల వ్యవధిలో, ప్రైవేటు స్థలాల్లో 72 గంటల వ్యవధిలో తొలగిస్తామని అన్నారు. కరపత్రాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు, ముద్రించే సమయంలో పబ్లిషర్ పేరు, ఫోన్ నెంబర్ ముద్రించాలని అన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే 1951 చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

జిల్లాలో 7 చోట్ల చెక్‌పోస్టులు

- ఎస్పీ అఖిల్‌మహాజన్



ఎన్నికల నిబంధనల ప్రకారం జిల్లాలో అవసరమైన మేరకు ఏడు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి 24 గంటల పాటు నిఘా ఉంచుతామని ఎస్పీ అఖిల్‌మహాజన్ అన్నారు. అక్రమ నగదు, లిక్కర్ సరఫరా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. ప్రజలు 50 వేల రూపాయలకు మించి నగదుతో ప్రయాణించవద్దని, అంతకుమించితే నగదుకు సంబంధించిన ఆధారాలు ఉండాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, డీపీఆర్వో శ్రీధర్ పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌ను కట్టుదిట్టంగా అమలు చేయాలి


పాల్గొన్న కలెక్టర్, అధికారులు

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 16: భారత ఎన్నికల సంఘం సాధారణ పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో వెంటనే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వస్తుందని, దీనిని కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, డీజీపీ రవిగుప్తా, ఇతర అధికారులతో కలిసి పార్లమెంటు ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఖీమ్యా నాయక్‌తో కలిసి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. 24 గంటల వ్యవధిలో ప్రభుత్వ భవనాల్లో వివిధ రాజకీయ పార్టీలకు, నాయకులకు సంబంధించిన హోర్డింగులు, నాయకుల ఫొటోలు, వాల్ రైటింగ్స్ తొలగించాలన్నారు. 48 గంటల వ్యవధిలో పబ్లిక్ ప్రాపర్టీస్ వద్ద హోర్డింగులు, ఫ్లెక్సీలు ఫోటోలు తొలగించాలని, ప్రైవేట్ స్థలాలో ఉన్న హోర్డింగులు, ఫ్లెక్సీలు, ఫోటోలను 72 గంటల్లో తొలగించాలని ఆయన అధికారులకు ఆదేశించారు. రాజకీయ పార్టీలు, వివిధ వర్గాలకు చెందిన ప్రజలకు ర్యాలీలు, సభల నిర్వహణకు అనుమతులు నిబంధనల ప్రకారం ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ విధానంలో జారీ చేయాలని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో అక్రమ నగదు, మద్యం ఇతర ప్రలోభాలకు ఓటర్లు గురికాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, జిల్లాలో అవసరమైన మేర చెక్ పోస్టులు ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు సంబంధించిన ప్రకటనలకు అనుమతి అదేరోజు అందించే విధంగా ఎంసీఎంసీ పనిచేయాలని అన్నారు. శాంతి భద్రతలు కట్టుదిట్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాజకీయ సమావేశాలు ఆలయాలు, మసీదులు, చర్చిలు, ప్రార్థన స్థలాలల్లో, పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో నిర్వహించరాదని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. ఎన్నికల యంత్రాంగంపై నమ్మకం కోల్పోయే విధంగా అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ నియమ నిబంధనలపై అన్ని రాజకీయ పార్టీలకు సమాచారం అందించాలన్నారు. జిల్లా వెబ్‌సైట్లు వివిధ ప్రభుత్వ వెబ్‌సైట్లో ముఖ్యమంత్రి, మంత్రుల ఫొటోలు తొలగించాలన్నారు. సువిధా యాప్ ద్వారా వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు జరగకుండా నిబంధనల ప్రకారం సకాలంలో రాజకీయ పార్టీలకు అభ్యర్థులకు అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని సూచించారు.

ప్రైవేట్ వస్త్ర ఉత్పత్తి ఆర్డర్లకు కృషి చేయాలి

- చేనేత జౌళి శాఖ డైరెక్టర్ అలుగు వర్షిణి


సమావేశంలో మాట్లాడుతున్న అలుగు వర్షిణి

8

రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు కాలం చెల్లింది

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, మార్చి 16: రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు కాలం చెల్లిందని, తొమ్మిది సంవత్సరాల బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో దోచుకున్న డబ్బుతో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలువాలని చూస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్‌లోని ప్రతిమ మల్టీప్లెక్స్‌లో దొరికిన ఆరు కోట్ల 67 లక్షల డబ్బులు ఎవరివని ప్రశ్నించారు. ఎన్నికలు షెడ్యూల్ రాకముందే విచ్చలవిడిగా డబ్బుల పంపిణీ చేసేందుకు బీఆర్‌ఎస్ నేతలు ప్లాన్ చేస్తున్నారని ఆరోపించారు. కరీంనగర్‌లో ఆర్టీసీ స్థలాన్ని లీజుకు తీసుకుని ప్రతిమ మల్టీప్లెక్స్ కట్టారని అది ఎవరిదో అందరికి తెలుసున్నారు. గత ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌కు కర్రుకాల్చి వాత పెట్టారని, కానీ మళ్లీ తొమ్మిదిన్నర యేళ్లలో సంపాదించిన డబ్బులు పంచి మళ్లీ గెలవాలని చూస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ నేతలు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు తిరస్కరిస్తారని, రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు కాలం చెల్లిందని అందులో మిగిలేది కేసీఆర్, కేటీఆర్, హరీష్, కవిత మాత్రమేనని ఎద్దేవా చేశారు. అధికారంలో వున్నప్పుడు జ్యోతిరావుఫూలే, అంబేద్కర్ జయంతి, వర్ధంతిలకు కేసీఆర్ ఏనాడు పూలమాలలు వేయలేదని గుర్తు చేశారు. ఓ మహిళ అయి వుండి మద్యం కుంభకోణంలో కవిత ఇరుక్కోవడం సిగ్గు చేటన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ రెండు ఒక్కటి కాదు అని చెప్పేందుకు మాత్రమే కవిత అరెస్ట్ డ్రామా అని అన్నారు. లోకసభ ఎన్నికల కోసమే బీజేపీ, బీఆర్‌ఎస్ డ్రామాలు ఆడుతున్నాయని, ఎప్పటికప్పుడు ప్రజలు గమనిస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్ మోదీని కలిసి ఏమి సాధించారని, మోదీని కేసీఆర్ కలిసింది కేవలం కేటీఆర్, కవితల కోసమేనని అన్నారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం ప్రధానిని ఏ రోజు కలువలేదని మండిపడ్డారు. రాష్ట్రాన్ని దోచుకుని పక్క రాష్ట్రాల్లో పార్టీ ఆఫీసులు పెట్టారని, ఇక్కడి రైతులు చనిపోతే వారిని పట్టించుకోకుండా పక్క రాష్ట్రాల్లోని రైతులకు డబ్బును పంచిపెట్టిన ఘనత కేసీఆర్ దక్కుతుందని అన్నారు. బీజేపీ మతం పేరిట రాజకీయం చేస్తోందని, దేశంలో మోదీ కాల పరిమితి ముగిసిందని అన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు ఒంటిపూట బడులు

- జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 16: అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారంనుంచి ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం మహిళ శిశుసంక్షేమ శాఖ కమీషనర్ ఉత్తర్వుల మేరకు ఈ ఒంటిపూట బడులు మే 31 వరకు ఉంటాయని పేర్కొన్నారు. ఎలాంటి అవంతారాలు లేకుంగా ప్రతి లబ్దిదారులకు నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. మధ్యాహ్నం 12.30 గంటలోపు లబ్ధిదారులకు భోజనాన్ని అందించేవిధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే ప్రీస్కూల్ యాక్టివిటీస్‌ని తప్పనిసరిగా జరిపించాలని సూచించారు. దీనిలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో డ్రాప్ అవుల్ అయిన పిల్లల్ని తిరిగి పాఠశాలలో చేర్పించడం, హోమ్ సర్వే ఇంటింటికి అంగన్‌వాడీ కార్యక్రమాన్ని చేపట్టాలని లక్ష్మీరాజం కోరారు.

నీటి ఎద్దడి తీర్చేందుకు నిధులు మంజూరు

వీర్నపల్లి, మార్చి 16: మండలంలోని మద్దిమల్ల గ్రామంలో తాగునీటి ఎద్దడి తీర్చేందుకు ఎంపీ బండి సంజయ్ కుమార్ ప్రత్యేక నిధులు మంజూరు చేసినట్లు బిజెపి నాయకులు తెలిపారు. ఎంపీ నిధుల ద్వారా మినీ వాటర్ ట్యాంక్ వద్ద బోరు వేయించడానికి లక్ష యాభై వేల రూపాయలను మంజూరు చేసినట్లు బీజేపీ యువమోర్చా మండల అధ్యక్షుడు బండారి మహేష్ పేర్కొన్నారు. తాగునీటి సమస్య ఇచ్చేందుకు ప్రత్యేక నిధులు మంజూరు చేసిన ఎంపీ బండి సంజయ్‌కి గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దిశా కమిటీ సభ్యుడు పీర్యా గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

సిరిసిల్ల రూరల్, మార్చి 16: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు తమ కళప్రదర్శనలతో ప్రజలకు అవగాహన కల్పించారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడులో శనివారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం ముఖ్య కూడళ్లల్లో కళాప్రదర్శనలను చేపట్టి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కళాకారులు ఎడముల శ్రీధర్‌రెడ్డి, శ్రీరాముల రామచంద్రం, గడ్డం శ్రీనివాస్, గుగ్గిళ్ల పర్శరాములు, వంతడ్పుల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలను, యువతులను వేధిస్తే కఠిన చర్యలు

- ఎస్పీ అఖిల్ మహాజన్


బహుమతులు అందిస్తున్న ఎస్పీ

సిరిసిల్ల క్రైం, మార్చి 16: మహిళలను, యువతులను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. శనివారం సిరిసిల్ల పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ ఆవరణలో విద్యార్థినులకు ఉమెన్ సేఫ్టీ, మహిళల రక్షణ చట్టాల గురించి, ర్యాగింగ్ ఈవ్‌టీజింగ్, పోక్సో చట్టంపై, సోషల్ మీడియా, సైబర్ నేరాలు తదితర వాటిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి లాంటి మతుపదార్థాలను తరమికొట్టడంలో ప్రతీ ఒక్క విద్యార్థి భాగస్వామ్యం కావాలన్నారు. విద్యార్థినులు పోకిరీల పట్ల జాగ్రత్తగా ఉండాలని, వేధింపులకు సంబంధించి ఏదైనా చిన్న సంఘటన జరిగినా వెంటనే ఇంట్లో తల్లిదండ్రులకు గానీ, టీచర్స్‌కు గానీ తెలియజేయాలన్నారు. జిల్లాలో మహిళలు, బాలికలపై జరుగుతున్న నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు ఏర్పాటు చేసిన షీ టీమ్ విద్యా సంస్థలు, బస్టాండ్‌లు, మహిళలు పని చేసే ప్రాంతాల్లో, బహిరంగ ప్రదేశాల్లో మఫ్టీలో నిరంతరం నిఘా ఉంచుతూ మహిళా చట్టాలపై వివిధ అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు సోషల్ మీడియాకి దూరంగా ఉండాలని, సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులు పంపే సందేశాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా వేధించినా, రోడ్డుపై వెళ్లేటప్పుడు, పనిచేసే ప్రదేశాల్లో అవహేలనగా మాట్లాడినా ఉద్దేశపూర్వకంగా వెంబడించినా వెంటనే 100, జిల్లా షీ టీమ్ నంబర్ 8712656425కు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తుందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో విద్యార్థులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో యాంటీడ్రగ్ ఏర్పాటు చేసి జిల్లాలోని అన్ని పాఠశాలలో, కళాశాలలో ఏర్పటు చేసిన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు కేటగిరి వారీగా నిర్వహించి గెలుపొందిన 96 మంది విద్యార్థులకు ఎస్పీ బహుమతులు ప్రదానం చేశారు. డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ రఘుపతి, షీ టీం ఏఎస్‌ఐ ప్రమీల పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మతి స్థిమితం లేని వ్యక్తి మృతి

ఎల్లారెడ్డిపేట, మార్చి 16: మండలంలోని తిమ్మాపూర్ గ్రామ శివారులో కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని మతి స్థిమితం లేని వ్యక్తి(53) శనివారం రాత్రి అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రోడ్డుపై నుంచి నడుచుకుంటూ తిమ్మాపూర్ వైపునకు వెళుతున్న మతిస్థిమితం లేని వ్యక్తిని ఎల్లారెడ్డిపేట నుంచి కామారెడ్డి వైపునకు ప్రయాణిస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేశారు.

ఖనిలో గంజాయి పట్టివేత

● పోలీసుల అదుపులో నలుగురు యువకులు

కోల్‌సిటీ, మార్చి16: గోదావరిఖని గంగానగర్‌లో శనివారం తెల్లవారుజామున నలుగురు యువకుల వద్ద నుంచి కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పాత నేరస్థుల నుంచి ఈ గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. నలుగురు యువకులపై కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

హుజూరాబాద్‌లో ఒకరి అరెస్టు

హుజూరాబాద్, మార్చి 16: హుజూరాబాద్ పట్టణంలోని రంగనాయకుల గుట్ట సమీపంలోని ఒడ్డెర కాలనీకి చెందిన దుండుగుల వెంకటేష్ అనే నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు శనివారం టౌన్ సీఐ బొల్లం రమేష్ తెలిపారు. వెంకటేష్‌పై గతంలో గంజాయి కేసు నమోదు కాగా పరారీలో ఉన్నాడు. పట్టణ శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా వెంకటేష్ పోలీసులను చూపి పారిపోతుండగా, పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేటలో వడగళ్ల వాన


అడవిపదిరలో కురిసిన వడగళ్లు


వన్‌పల్లిలో వడగళ్ల వానకు నేలకొరిగిన వరిపంట

వీర్నపల్లి, మార్చి 16: వీర్నపల్లి మండలంలోని వన్‌పల్లి, శాంతినగర్, అడవి పదిర, రంగంపేట గ్రామాలతో పాటు పలు తండాల్లో శనివారం సాయంత్రం వడగళ్లతో కూడిన వర్షం కురిసింది. ఈ అకాల వర్షానికి పొట్టదశకు వచ్చిన వరిపంట భారీస్థాయిలో దెబ్బతినే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈదురు గాలులతో కూడిన వర్షానికి పలుచోట్ల వరిపంట నేలకొరగడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అడవిపదిరలో రెండు కరెంట్ స్తంభాలు నేలకూలాయి. ఇంకా 15 నుంచి నెల రోజులకు కోతలు ప్రారంభం కానుండడంతో ఇంతలోనే వడగళ్లతో రైతులకు కడగండ్లు మిగిల్చనుందని వారు వాపోయారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలంలో శనివారం సాయంత్రం వర్షం కురిసింది. ఆకాశమంతా మేఘావృతమై వానపడడంతో రహదారులు నీటితో నిండిపోయాయి. మండల కేంద్రంతో పాటు పదిర, హరిదాస్‌నగర్, వెంకటాపూర్, దుమాల, అల్మాస్‌పూర్, రాజన్నపేట, గుండారం, తిమ్మాపూర్ తదితర గ్రామాల్లో వడగళ్ల వాన పడింది. పొట్టదశకు వచ్చిన వరి పంట చేతికందకుండాపోతోందని రైతులు ఆందోళన చెందారు. నష్టం మిగుల్చుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

రుద్రంగిలో దుకాణాల్లోకి చేరిన వరదనీరు

రుద్రంగి, మార్చి 16: రుద్రంగి మండల కేంద్రంలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంలోని కోరుట్ల - వేములవాడ ప్రధాన రహదారికి ఇటీవల ఎత్తు పెంచడంతో దుకాణ సముదాయాలు కిందికి కావడంతో శనివారం రాత్రి కురిసిన వర్షానికి బస్టాండ్ నుంచి ఇందిరాచౌక్ వరకు గల దకాణాల్లోకి వరద నీరు వెళ్లింది. ఇందిరాచౌక్‌లోని ఓ బట్టల దుకాణంలో బట్టలు తడిసి ముద్దయ్యాయి. వరద నీరు దుకాణాల్లోకి రాకుండా మురికికాలువలు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు, దుకాణదారులు కోరుతున్నారు.


దుకాణంలోకి చేరిన నీరు

పోలీసు కస్టడీకి మాజీ తహసీల్దార్

కరీంనగర్ అర్బన్, మార్చి 16: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించడమే కాకుండా బాధితుడి భూమిని ఆక్రమణకు పాల్పడిన కేసులో అరెస్టు అయి కరీంనగర్ జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న మాజీ తహసీల్దార్ చిల్ల శ్రీనివాస్‌ను పోలీసులు 48 గంటల కస్టడీకి తీసుకున్నారు. కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం ఉదయం 10 గంటలకు కస్టడీకి తీసుకోగా సోమవారం ఉదయం 10 గంటలకు మళ్లీ జైలుకు తరలించనున్నారు. కస్టడీకి తీసుకున్న అనంతరం ఎమ్మార్వోను అతని ఇల్లు, గెస్ట్‌హౌస్‌లకు తీసుకువెళ్లి సోదాలు నిర్వహించారు. ఎమ్మార్వోపై నమోదైన కేసుకు సంబంధించి కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.


శ్రీనివాస్‌ను అతని ఇంటికి తీసుకెళ్తున్న పోలీసులు

కొండగట్టులో ముగిసిన పవిత్రోత్సవాలు

మల్యాల, మార్చి 16: కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధానంలో గత మూడు రోజులుగా కొనసాగుతున్న పవిత్రోత్సవాలు శనివారంతో ముగిసాయి. చివరి రోజు స్వామి వారికి క్షీరాభిషేకం, సహస్ర నాగవల్లిదళ అర్చన, పట్టు వస్త్రాలంకరణ, దివ్య ప్రబంధ పారాయణం, హవనం, పూర్ణాహుతి, దేవతా ఉద్వాసనం, శ్రీ స్వామి వారికి పవిత్రధారణ, మహదాశీర్వచనం, పండిత సన్మానం కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో పవిత్ర ప్రధానం, సహస్రదీపాలంకరణ, గరుడ వాహన సేవ కార్యక్రమాలను ఆలయ అర్చకులు, వేదపండితులు ఘనంగా నిర్వహించారు. పవిత్రోత్సవాల ముగింపు రోజు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ ట్రస్టీ మారుతీ, ఏఈవో అంజయ్య, ఆలయ పర్యవేక్షకులు సునీల్, శ్రీనివాస్‌శర్మ, ఆలయ స్థానాచార్యులు కపీంధర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేంద్రప్రసాద్, రఘు ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

● నూతన విగ్రహాల ప్రతిష్ఠ

ఆలయంలో నూతనంగా సీతా,రామ,లక్ష్మణ, బేతాళుడు, పంచముఖ ఆంజనేయస్వామి, శ్రీదేవి, భూదేవి, వెంకటేశ్వర స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. వీటిని పలువురు భక్తులు దేవస్థానానికి అందించగా ప్రతిష్ఠించడానికి మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం ప్రాణప్రతిష్ఠ అనంతరం యాగశాల, ప్రధాన ఆలయంలో ప్రతిష్ఠించారు.


పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేదపండితులు

జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్స్ స్వాధీనం

● రెండు క్రషర్ల యజమానులపై కేసు నమోదు

తంగళ్లపల్లి, మార్చి 16: అనుమతి లేకుండా జిలెటిన్‌స్టిక్స్, డిటోనేటర్స్ వినియోగిస్తున్న క్రషర్ యజమానులపై కేసు నమోదు చేసినట్లు ట్రైనీ ఐపీఎస్ రాహుల్‌రెడ్డి తెలిపారు. శనివారం తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్ ఇంచార్జ్ ఎస్‌హెచ్‌వో , ట్రైనీ ఐపీఎస్ రాహుల్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో గోపాల్‌రావుపల్లి గ్రామానికి చెందిన మీరాల భాస్కర్ జిల్లెల్ల గ్రామ శివారులోగల శాంభవి స్టోన్ క్రషర్ మేనేజింగ్ పార్టనర్‌గా ఎనిమిది సంవత్సరాలుగా క్రషర్ వ్యవహారాలు చూసుకుంటున్నాడు. శాంభవి క్రషర్ పక్కనే ఉన్న గుట్టను బ్లాస్ట్ చేయడానికి సిద్దిపేటకు చెందిన విజయ్ ఎక్స్‌ప్లోజివ్ షాప్‌లో ఎక్స్‌ప్లోజివ్స్‌ను తీసుకువచ్చి ఆ గుట్టకు అమర్చి గుట్టను పేల్చి బండను సేకరిస్తున్నారు. నాలుగు నెలల క్రితం సిద్ధిపేటలోని విజయ్ ఎక్స్‌ప్లోజివ్స్ షాప్ నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఎక్స్‌ప్లోజివ్స్‌లను భాస్కర్ కొనుగోలు చేసి క్రషర్ పరిసర ప్రాంతాల్లో డస్ట్‌లో డంప్ చేశాడు.ఈ క్రమంలో గుట్టను బ్లాస్ట్ చేయడానికి కొంత ఎక్స్‌ప్లోజివ్స్ బయటకు తీసి గుట్టను బ్లాస్ట్ చేయడానికి చూస్తున్న క్రమంలో సమాచారం అందుకుని క్రషర్ దగ్గర భాస్కర్‌ను అదుపులోకి తీసుకొని 83 ఎంఎం ,సైజ్ గల 87 జిలేటిన్ స్టిక్స్, 35 ఎంఎం సైజ్ గల 249 జిలాటిన్ స్టిక్స్, 20 మీటర్ల రెడ్ వైర్ స్వాధీనం చేసుకోని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే ఓగులపూర్ గ్రామా శివారులో ఉన్న చేమంతి స్టోన్‌క్రషర్ యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. చేమంతి స్టోన్ క్రషర్ యజమానులు అయిన సిరిసిల్ల పట్టణం రెడ్డివాడకు చెందిన మడుకు శ్రీకాంత్‌రెడ్డి, పెద్దూర్ గ్రామానికి చెందిన కసారం సాగర్‌బాబు అనే ఇద్దరు వ్యక్తులు స్టోన్ క్రషర్‌లో అక్రమంగా అనుమతి లేకుండా ఫ్యూజ్‌లు, డిటోనేటర్స్, జిలెటన్ స్టిక్స్‌లు నిల్వ ఉంచినట్లు సమాచారం అందిదన్నారు. క్రషర్ లో తనిఖీలు నిర్వహించి 196 ఫ్యుజ్‌లు, 25 ఎంఎం జిలటిన్‌స్టిక్స్ 1087 , డిటోనేటర్స్ 897ఉండగా వాటిని స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


స్వాధీనం జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్స్

ప్రధాని మోదీ సభను విజయవంతం చేయాలి : బీజేపీ

కరీంనగర్ టౌన్, మార్చి 16: జగిత్యాల జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించే ప్రధాని మోదీ విజయ సంకల్ప సభను విజయవంతం చేయాలని బీజేపీ శాసన సభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. కరీంనగర్‌లో పార్లమెంట్ ముఖ్య నేతల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. తప్పుడు హామీలు, భూటకపు మాటలతో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చి వంద రోజులు గడిచినా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. ఆ పార్టీకి పార్లమెంటు ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు లేదని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ తెలంగాణలో 12 పార్లమెంట్ స్థానాల్లో గెలవబోతోందన్నారు. కవిత అరెస్టుకి బిజేపి కి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

ఓదెల మార్చి 16: మండల కేంద్రానికి చెందిన బిటెక్ విద్యార్థి ముద్దసాని వెంకట సాయి (27) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బీటెక్ పూర్తి చేసి నాలుగేళ్లు అయినా కూడా, ఉద్యోగం రాలేదు. ఉద్యోగం కోసం పలు పోటీ పరీక్షలు రాసినప్పటికీ ఎలాంటి ఫలితం లేకపోవడంతో మనస్థాపం చెందిన వెంకటసాయి శుక్రవారం ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సలహా మేరకు హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుని తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్‌రెడ్డి తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

జ్యోతినగర్, మార్చి 16: స్థానిక ఎన్టీపీసీ అన్నపూర్ణ కాలనీకి చెందిన ఎం వెంకటయ్య(85) అనే వృద్ధుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎన్టీపీసీ పోలీసులు తెలిపారు. మృతుని కొడుకు, కోడలు ఒక శుభకార్యం నిమిత్తం శుక్రవారం హైదరాబాద్ వెళ్లారు. వృద్ధాప్యంతో జీవితంపై విరక్తి చెంది ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యచేసుకున్నాడని, ఈ మేరకు మృతుని కుమారుడు బచ్చు శంకరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ధర్మారం,మార్చి16: మండలంలోని నర్సింహులపల్లి గ్రామంలో ఓ వ్యవసాయ బావిలో శనివారం మధ్యాహ్నం క్రేన్ సహాయంతో పూడిక తొలగిస్తుండగా జరిగిన ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన లక్కాకుల రాజయ్యకు చెందిన వ్యవసాయ బావిలో గ్రామంలో ఉంటున్న సూర వెంకటస్వామి, తండ్రి సైదులు, తల్లి కళమ్మ, మరో ఇద్దరు కలిసి క్రేన్ సహాయంతో పూడిక తొలగిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం సమయంలో వ్యవసాయ బావిలో సూర వెంకటస్వామి(22) పూడికను క్రేన్ డబ్బాలో పోస్తుండగా డబ్బాను ముట్టుకోవడంతో కరెంట్ షాక్ తగిలి అక్కడిక్కడే మృతిచెందాడు. సంఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

లారీ బోల్తా : డ్రైవర్ మృతి

సుల్తానాబాద్, మార్చి 16: సుల్తానాబాద్ పట్టణంలోని రాజీవ్ రహదారిపై శనివారం తెల్లవారుజాము ఐదున్నర గంటలకు లారీ బోల్తా పడింది. క్యాబిన్‌లో ఇరుక్కుపోయి తీవ్రగాయాలతో ఉన్న డ్రైవర్‌ను పోలీసులు ఆస్పత్రికి తరలించగా చికిత్స చెందుతూ మృతిచెందాడు. హైదరాబాద్ నుంచి చెత్త లోడ్‌తో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాజానంద్‌గామ్‌లోని చెత్త ఆధారిత పవర్ ప్లాంట్‌కు వెళుతుండగా సుల్తానాబాద్ ఐబీ చౌరస్తా దాటిన తర్వాత మూలమలుపు వద్ద లారీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. మహారాష్ట్రలోని గున్థియా జిల్లా సిర్పూర్ గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ రాజన్ లారీ క్యాబిన్‌లోనే తీవ్ర గాయాలతో ఇరుక్కుపోయారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ శ్రావణ్‌కుమార్, పోలీసులు, గాజుల రాజమల్లు తదితరులు ఆస్పత్రికి తరలించారు. అతను చికిత్స పొందుతూ మృతిచెందగా, క్లీనర్ హితేంద్ర మున్నాలాల్ తీవ్రంగా గాయపడ్డాడు.

వెంకయ్యకుంటలో చోరీ

ముస్తాబాద్, మార్చి 16: మండలంలోని వెంకయ్యకుంటలో శుక్రవారం చోరీ జరిగింది. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కంకణాల మల్లవ్వ తన ఇంటికి తాళం వేసి తన కొడుకు ఇంటి దగ్గర పడుకుంది. గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి బీరువాలోదాచి ఉంచిన రూ. 86 వేల నగదును చోరీ చేశారు. బంగారు రింగులు, పట్టగొలుసులు ఎత్తుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

చొప్పదండి 16 : చొప్పదండి శివారులోని డి 87 కెనాల్ వద్ద గుర్తుతెలియని మృతదేహం లభ్యమయింది. ఎస్ఐ ఉపేంద్రచారి కథనం మేరకు పట్టణంలోని ఝాన్సీ స్కూల్ దగ్గర కెనాల్‌లో గుర్తుతెలియని మృతదేహం ఉందని లష్కర్ గోపాల్ ఇచ్చిన సమాచారం మేరకు మృతదేహాన్ని బయటకి తీసి అక్కడే పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు. 15 రోజుల క్రితమే చనిపోయినట్లు తెలుస్తుందని మృతుడు సుమారుగా 30 నుండి 40 సంవత్సరాల వయస్సు ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట ,మార్చి 16: ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి గ్రామ శివారులోని కామారెడ్డి సిరిసిల్ల ప్రధాన రహదారిపై శనివారం బైకు అదుపుతప్పి రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో మండలంలోని బండలింగంపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి రాగుల దేవయ్య తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని 108వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

బావిలో పడి వ్యక్తి మృతి

రాయికల్, మార్చి 16: ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ఇటిక్యాలలో జరిగింది. ప్రకాశం జిల్లాకు చెందిన ఇంటూరి సుభాష్ (25) కూలీ పనుల నిమిత్తం ఇటిక్యాలకు వలస వచ్చాడు. ఈ నెల 10వ తేదీన రాత్రి 8 గంటల ప్రాంతంలో సుభాష్ బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి ఇటిక్యాల శివారులోని వ్యవసాయ బావిలో పడి చనిపోయాడు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై అజయ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

హుజూరాబాద్‌రూరల్, మార్చి 16 : మండలంలోని సింగాపూర్ గ్రామ శివారులోని లింగాపూర్ క్రాస్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి ఆగి ఉన్న ఓ లారీని వెనుక నుంచి టాటా ఏసీ ఆటో ఢీకొన్న ఘటనలో ఒకరూ మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం గ్రామానికి చెందిన కెమ్మసారపు తిరుపతి(40) శుక్రవారం హుజూరాబాద్‌లో ఉండే తన అమ్మను చూసేందుకు అదే గ్రామానికి చెందిన ఎండీ గఫార్‌తో కలిసి టాటా ఏసీ ఆటోలో బయల్దేరాడు. ఆటో సింగాపూర్ గ్రామ శివారులోని లింగాపూర్ క్రాస్ వద్దకు రాగా, చీకట్లో నిలిపి ఉన్న లారీని వెనుక నుంచి ఆటో ఢీకొట్టింది.ఈ ఘటనలో తిరుపతి అక్కడికక్కడే మృతి.. చెందగా గఫార్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు అక్కడికి చేరుకుని క్షతగాత్రుడిని హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య కెమ్మసారపు వెంకటలక్ష్మీ ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

మెట్‌పల్లిలో గుర్తుతెలియని వాహనం ఢీ

● ముగ్గురికి తీవ్ర గాయాలు

మెట్‌పల్లి, మార్చి, 16 : మెట్‌పల్లి అనుబంధ గ్రామమైన ఆరుపేట గ్రామ బస్టాండ్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ముగ్గురు మహిళలకు తీవ్ర గాయాలపాలయ్యారు. శనివారం రాత్రి ఆరపేట బస్టాండ్‌లో బాదినేని భూమక్క, నల్ల లక్ష్మి, శనిగారపు తుక్కవ్వలు బస్సు దిగి రోడ్డు దాటుతుండగా వేగంగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. స్థానికులు గమనించి ముగ్గురిని మెట్‌పల్లి ప్రభుత్వ ఆసపత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలం పరిశీలించి గాయాలపాలైన మహిళల వద్ద వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాజన్న సేవలో ప్రముఖులు

వేములవాడ టౌన్, మార్చి 16 : వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఉపలోకయుక్త జస్టిస్ వి నిరంజన్‌రావు కుటుంబ సమేతంగా శ్రీస్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం వారికి శ్రీస్వామి వారి నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించగా ఆలయ సూపరిండెంట్ నాగుల మహేష్ రాజన్న ప్రసాదాన్ని అందేశారు. కాగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ రాజన్న ఆలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వస్తి స్వాగతం పలికారు. అనంతరం శ్రీస్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొని కోడెమొక్కు చెల్లించుకున్నారు.

తండ్రిపై గొడ్డలితో తనయుడి దాడి

రాయికల్, మార్చి 16: మండలంలోని ధర్మాజీపేట గ్రామానికి చెందిన మ్యాకల అంజయ్య తన తండ్రి గంగారెడ్డిని డబ్బుల విషయంలో శుక్రవారం రాత్రి గొడ్డలితో దాడి చేసినట్లు రాయికల్ ఎస్సై అజయ్ పేర్కొన్నారు. దీంతో గంగారెడ్డి తలకు తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గంగారెడ్డి చెల్లెలు బద్ది సులోచన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రధాని పర్యటన సందర్భంగా జగిత్యాలలో ట్రాఫిక్ ఆంక్షలు

జగిత్యాల టౌన్, మార్చి 16 : జగిత్యాల జిల్లా కేంద్రంలో ఈ నెల 18న దేశ ప్రధాన మంత్రి మోదీ పర్యటన సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ శనివారం పేర్కొన్నారు. జిల్లా కేంద్రానికి ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం సాయంత్రం వరకు భారీ వాహనాల అనుమతి లేదన్నారు. ఆదివారం ఎలాంటి డ్రోన్లు ఎగురవేయడానికి అనుమతి లేదన్నారు. పదవ తరగతి పరీక్షలు ప్రారంభం దృష్ట్యా విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు వీలైనంత త్వరగా చేరుకోవాలన్నారు.

వాహనాల మళ్లింపు

కరీంనగర్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్లే వాహనాలు ధరూర్ కెనాల్ నుంచి బైపాస్ ద్వారా కోరుట్ల వైపు వెళ్లాలి. నిజామాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్లే వాహనాలు జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి బైపాస్ ద్వారా ధరూర్ కెనాల్ మీదుగా వెళ్లాలి.

ధర్మపురి నుంచి కరీంనగర్ వైపు వెళ్లేవారు తమ వాహనాలను జగిత్యాల రూరల్ మండలం పొలాస నుంచి తిమ్మాపూర్ బైపాస్ మీదుగా ధరూర్ కెనాల్ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. కరీంనగర్ నుంచి ధర్మపురి వైపు వెళ్లేవారు తమ వాహనాలను ధరూర్ కెనాల్ మీదుగా తిమ్మాపూర్ బైపాస్ మీదుగా పొలాస గ్రామం మీదుగా వెళ్లాల్సి ఉంటుంది.

ధర్మపురి నుంచి నిజామాబాద్ వైపు వెళ్లే వాహనాలను జగిత్యాల రూరల్ మండలం పొలాస నుంచి తిమ్మాపూర్ బైపాస్ మీదుగా ధరూర్ కెనాల్ మీదుగా బైపాస్ రోడ్‌లో కోరుట్ల వైపు వెళ్లేలా దారి మళ్లించారు. ట్రాఫిక్ ఆంక్షలను ప్రతి ఒక్కరూ పాటించాలని పోలీసులు తెలిపారు.

నేరాల కట్టడి కోసమే కార్డన్ సెర్చ్ : డీఎస్పీ

చందుర్తి, మార్చి 16: నేరాల కట్టడి కోసమే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని వేములవాడ డీఎస్పీ నాగేంద్ర చారి అన్నారు. చందుర్తి మండలం రామన్నపేటలో శనివారం ఉదయం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నేర రహిత గ్రామాలుగా చేయలనే లక్ష్యంగా ఎస్పీ ఆదేశాలతో ఈకార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సరైన ధ్రువపత్రాలులేని వాహనాలకు జరిమానాలు విధించి సీజ్ చేశారు. సంబంధిత వాహన దారులు సరైన పత్రాలు చూపించి వాహనాలు తీసుకెళ్లాలని సూచించారు. వాహనాలు నడిపే ప్రతీఒక్కరు తప్పనిసరిగా వాహనాలకు ఆర్సీ, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, లేదా డయల్ 100 నంబర్‌కు ఫోన్ చేసినా వెంటనే చర్యలు చేపడుతమన్నారు. కార్యక్రమంలో వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ ఎస్ఐలు శ్రీకాంత్, అశోక్, పృథ్వీధర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీకి రాజీనామా చేసిన ముగ్గురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు

సిరిసిల్ల టౌన్, మార్చి 16 : బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముగ్గురు మున్సిపల్ 13, 21, 25 వార్డులకు చెందిన కౌన్సిలర్లు జాగీరు శైలు, వేముల రవి, కుడిక్యాల రవికుమార్ బీఆర్ఎస్ పార్టీకి శనివారం రాజీనామా చేశారు. వారి వెంటే సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్ కూడా బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశాడు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డు ప్రజలు మేమ పనిచేస్తామన్న నమ్మకంతో ఆశీర్వదించి తమను గెలిపించారన్నారు. స్వతంత్ర అభ్యర్థులుగా గెలిచిన తాము అధికార పార్టీలోకి వెళ్తే వార్డులు అభివృద్ధి జరుగుతుందని భావించడం జరిగిందన్నారు. నాడు అధికార పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయాలని వారి దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేదన్నారు. ప్రస్తుతం పార్టీ కోసం పని చేయలేక పోతున్నందున బీఆర్ఎస్ పార్టీకీ రాజీనామా చేస్తున్నామన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను సమీక్షించాలి

సిరిసిల్ల రూరల్, మార్చి 16: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అమ్మ అదర్శ పాఠశాల కమిటీలను ప్రభుత్వం సమీక్షించి నిబంధనలను సమరించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దోర్నాల భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. సిరిసిల్లపట్టణం శివనగర్‌లోని కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం టీపీటీఎఫ్ జిల్లా కమిటి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధి, పర్యవేక్షణ, నిధుల వినియోగం వంటి పనుల కోసం గతంలో పాఠశాల యాజమాన్య కమిటీల స్థానంలో విద్యాశాఖ అమ్మ అదర్శ పాఠశాల కమిటీలను రాత్రికిరాత్రే ఏర్పాటు చేసిందన్నారు. కానీ మార్గదర్శకాలలో సహేతుకత లేదన్నారు. ఒక్కరినే నాలుగు పాఠశాలలకు ఛైర్మన్‌గా చేయడ మేంటని ప్రశ్నించారు. తక్షణమే ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి అందరికి అమోదయోగ్యమైన నిర్ణయం చేయాలని అన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు పురం వాసుదేవరావు, మల్లారపు పురుషోత్తం, జిల్లా కార్యదర్శి దబ్బెడ హన్మాండ్లు, మైలారం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌పీఎస్‌లో ప్రవేశానికి లాటరీ పద్ధతి

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 16 : హైదరాబాద్ పబ్లిక్‌స్కూల్(హెచ్‌పీఎస్) బేగంపేటలో 1వ తరగతి ప్రవేశానికి శనివారం కలెక్టరేట్‌లో లాటరీ పద్ధతిన విద్యార్థిని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఎంపిక చేశారు. జిల్లా కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో .దరఖాస్తులు చేసుకున్న విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో జరిగిన లాటరీలో గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మెద రమణ కుతురు మెద చిన్మయి ఎంపికయ్యింది. వేయిటింగ్ లిస్ట్‌లో ముస్తాబాద్ మండల చీకోడు గ్రామానికి చెందిన పల్లె శివాన్సీ వేములవాడ రూరల్ మండలం వెంకటాంపల్లె గ్రానికి చెందిన అవునూరి తనూష్ ఎంపికయ్యారని అదనపు కలెక్టర్ ప్రకటించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పోరేషన్ ఈడీ డాక్టర్ వినోద్‌కుమార్, జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వయోజనులకు అక్షరాస్యతపై అవగాహన కల్పించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 16 : జిల్లాలో ఉన్న వయోజనులందరికీ న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమంలో భాగంగా అక్షరాస్యతపై అవగహన కల్పించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూజారి గౌతమి ఆదేశించారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో శనివారం సంబంధిత శాఖల జిల్లా అధికారులతో న్యూఇండియా లిటరసీ కార్యక్రమంపై సమీక్షించారు. ఈ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో ప్రభావవంతంగా అమలు చేసేందుకు నిర్దిష్టమైన కార్యచరణ రూపొందించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. 15 సంవత్సరాలపైబడిన వయోజనులందరికి ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ, బేసిక్ ఎడ్యూకేషన్, క్రిటికల్ స్కిల్స్, కంటిన్యూ ఎడ్యూకేషన్ అందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. మొదటగా లబ్ధిదారులను గుర్తించి ఈ సంవత్సరం జిల్లాలో 14వేల 580 మంది వయోజనులకు ఈకార్యక్రమం వలన ప్రయోజనంచేకూర్చేందుకు కృషిచేస్తామని డీఈవో రమేష్‌కుమార్ వివరించారు. జడ్పీ సీఈవో ఉమరాణి అడల్ ఎడ్యూకేషన్ డిప్యూటి డైరెక్టర్ జయశంకర్, జిల్లా పంచాయితీ అధికారి వీరబుచ్చయ్య, డీఆర్‌డీవో శేషాద్రి, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 1,817 కేసులు పరిష్కారం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి ప్రేమలత

సిరిసిల్ల క్రైం, మార్చి 16: లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయ మూర్తి ఎన్. ప్రేమలత అన్నారు. సిరిసిల్ల కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1,817 కేసులు పరిష్కరించగా రూ. 9.16 లక్షలు చెల్లింపులు జరిగాయన్నారు. ఇవే కాకుండా బీఎస్ఎన్ఎల్, బ్యాంక్, డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రాఫిక్‌కు సంబంధించిన 1,37,302 కేసులు పరిష్కారం అయ్యాయని, ఇందుకు 92.53 లక్షలు జరిమానాలు, ఇతర పద్దులు చెల్లించారని ఆమె అన్నారు. కక్షిదారుల మధ్య రాజీ ఏర్పడితే సమస్య పరిష్కారానికి మార్గం ఏర్పడు తుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి సట్టు రవీందర్, జూనియర్ సి విల్ జడ్జిలు ప్రవీణ్, సృజనలు, లోక్‌అదాలత్ సభ్యుడు చింతోజి భాస్కర్ పాల్గొన్నారు .

అధికారులపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

- రుద్రంగి మండల సర్వసభ్య సమావేశం

రుద్రంగి, మార్చి 16: పలువురు ప్రజాప్రతినిధులు మండల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రుద్రంగి మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీపీ గంగం స్వరూపరాణి అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. వివిధ శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గంగం స్వరూపరాణి మహేష్ మాట్లాడుతూ రుద్రంగిలో ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటు కోసం స్థలాన్ని కేటాయించాలని రెవెన్యూ ఆధికారులకు నాలుగు సంవత్సరాలుగా కోరుతున్నామన్నారు. సీసీ రోడ్లకు భూమి పూజ చేస్తే తమకు ఎందుకు చెప్పడం లేదని ఆధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పీఆర్‌ఏఈ మాట్లాడుతూ భూమిపూజలు చేసినట్లు తమకు తెలువదని, పనులు మాత్రం జరుగుతున్నాయన్నారు. జడ్పీటీసీ గట్ల మీనయ్య మాట్లాడుతూ మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ లైట్లు వెలగడం లేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఆనంతరం వైస్ ఎంపీపీ పిసరి చిన్నభూమయ్య మాట్లాడుతూ రేషన్ దుకాణాల్లో ఈకేవైసీ కాకుంటే మానాలలో బియ్యం ఇవ్వడం లేదని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఫారెస్ట్ అధికారులు, ఆర్ అండ్‌బీ అధికారులు సర్వసభ్య సమావేశానికి పూర్తిస్థాయిలో హాజరుకావడం లేదన్నారు. సమావేశంలో జడ్పీటీసీ గట్ల మీనయ్య, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, వైస్ ఎంపీపీ పిసరి చిన్నభూమయ్య, ఎంపీడీవో నటరాజు, తహసీల్ధార్ శ్రీలత పాల్గొన్నారు.

పంటలు ఎండుతున్నాయని రైతుల రాస్తారోకో

చందుర్తి మార్చి 16: పంటలు ఎండిపోతున్నయని ఎల్లంపల్లి కాలువ ద్వారా గోదావరి జలాలను విడుదల చేయాలని చందుర్తి మండలం మూడపల్లిలోని కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారిపై నర్సింగాపూర్ గ్రామానికి చెందిన రైతుల శనివారం రాస్తారోకో చేపట్టారు. దాదాపు రెండు గంటల పాటు రాస్తారోకో కొనసాగడంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న చందుర్తి ఎస్ఐ శ్రీకాంత్ చేరుకొని ఆందోళన చేస్తున్న రైతులతో తహసీల్దార్ శ్రీనివాస్‌తో పాటు ఎల్లంపల్లి ప్రాజెక్టు అధికారులతో ఫోన్‌లో మాట్లాడించారు. మూడునాలుగు రోజుల్లో నీటిని విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో పెరుక గంగరాజు, చింతకుంట సాగర్, కొత్త దామోదర్ రెడ్డి, పెరుక రంజిత్, కొమ్మనపెల్లీ రాజశేఖర్, మిడిదొడ్డి అంజయ్య, మర్రిపెల్లి రాజు, పూడూరి మల్లారెడ్డి, చిట్యాల రాజు, పూడూరి ప్రశాంత్‌రెడ్డి, కోలకాని శ్రీనివాస్, మామిడాల రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ వస్త్ర ఉత్పత్తి ఆర్డర్లకు కృషి చేయాలి

- ఆసక్తి గల ఆసాములకు సూరత్‌లో శిక్షణ - చేనేత జౌళి శాఖ డైరెక్టర్ అలుగు వర్షిణి - నేత కార్మికుల సమస్యలపై కార్మిక ప్రతినిధులతో సమావేశం



వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

సిరిసిల్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల నేత కార్మికులు, ఆసాములు ప్రైవేటు వస్త్ర పరిశ్రమకు సంబంధించిన ఆర్డర్ల సాధన దిశగా కృషి చేయాలని మార్కెట్‌లో పోటీ పడేందుకు అవసరమైన శిక్షణ ఇతర సహకారాలను అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చేనేత జౌళి శాఖ డైరెక్టర్ అలుగు వర్షిణి అన్నారు. శనివారం సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో కార్మిక సంఘాల ప్రతినిధులతో నేత కార్మికుల సమస్యల పరిష్కారంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షిణి మాట్లాడుతూ పరిశ్రమ మనుగడకు ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని అదే సమయంలో పూర్తి స్థాయిలో ప్రభుత్వంపై ఆధారపడడం మంచిది కాదని ప్రైవేటు రంగంలో అవకాశాలను సైతం అన్వేషించాలని అన్నారు. ప్రభుత్వం ఉన్న అవకాశాల మేరకు మాత్రమే బట్ట తయారీ కోసం ఆర్డర్లు ఇవ్వగలుగుతుందని త్వరలో సిరిసిల్లతో పాటు నారాయణపేట, చౌటుప్పల్ వంటి ప్రాంతాల్లో చేనేత క్లస్టర్లు వస్తాయన్నారు. ఆసక్తి గల ఆసాములకు నేతన్నలు, బృందంగా ఏర్పాటు చేసి సూరత్‌లో వస్త్ర పరిశ్రమ పనితీరుపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. తమిళనాడు, సూరత్ వంటి ఇతరప్రాంతాల్లో ఉన్న వస్త్ర పరిశ్రమలో అందుబాటులో ఉన్న టెక్నాలజీతో రూపొందించే బట్ట ఆర్డర్లు సాధించే ప్రయత్నం చేయాలన్నారు. చేనేత రంగంలో వినియోగిస్తున్న ఆధునిక సాంకేతికత ప్రింటింగ్ యూనిట్, ప్రాసెసింగ్, కటింగ్ యూనిట్ మొదలైన అంశాలపై అవగాహన కల్పించుకొని సొంత పెట్టుబడితో వ్యాపారం ప్రారంభించాలనుకునే వారికి అవకాశాలు కల్పిస్తామని వివరించారు. చేనేత రంగంలో నూతన టెక్నాలజీని అలవర్చుకోవాలని, బ్యాంకు రుణాల ద్వారా కొత్త యంత్రాల కొనుగోలుకు ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. అనవసరపు ధర్నాలు, పోరాటాలు చేయవద్దని మనము తయారు చేసే వస్త్రాల్లో మంచి నాణ్యత ఉంటే అధిక ఆర్డర్లు వస్తాయని అన్నారు.

ప్రభుత్వం నూలుపై అందించే సబ్సిడీని ఎప్పటికప్పుడు సకాలంలో విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటామని, అదే విధంగా పాత బకాయిలను సైతం సెప్టెంబరు నాటికి అందజేస్తామని అన్నారు. ఏడు సంవత్సరాల నుంచి బతుకమ్మ చీరలు ప్రభుత్వ బట్టలకు సంబంధించిన ఆర్డర్లు అందిస్తున్నా ఆశించిన స్థాయిలో మార్పు రాలేదన్నారు. ప్రభుత్వంపై ఆధారపడకుండా బహిరంగా మార్కెట్‌లో అవకాశాలు అందిపుచ్చుకోవాలని సూచించారు. ప్రైవేటు రంగంలో నిలదొక్కుకునేందుకు నేత కార్మికులకు అవసరమైన సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ప్రతి నేతన్న తప్పనిసరిగా టీ నేతన్న యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, చేనేత జౌళి శాఖ ఏడీ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

● ప్రభుత్వ ఆర్డర్లతో ఉపాధి కల్పించాలి

- కార్మిక సంఘాల వినతి

సిరిసిల్లలో పవర్‌లూం పరిశ్రమపై ఆధారపడి పని చేస్తున్న కార్మికులకు మూడు నెలలుగా పనిలేక ఉపాధి కోల్పోయారని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారిని బతుకమ్మ చీరలు ఇతర ఆర్డర్లు ఇచ్చి ఉపాధి కల్పించాలని జిల్లా పవర్‌లూం వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు కోడం రమణ తదితరులు చేనేత జౌళి శాఖ డైరెక్టర్ అలుగు వర్షిణికి వినతి పత్రం అందించారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో ఉపాధి కోల్పోయిన పవర్‌లూం అనుబంధ రంగాల కార్మికులందరికీ పది వేల రూపాయల చొప్పున తక్షణ సాయం అందించాలని కోరారు. బతుకమ్మ చీరలకు సంబంధించిన బకాయిలు, అలాగే యారన్ సబ్సిడీ డబ్బులు విడుదల చేయాలని కోరారు. వర్కర్ టు ఓనర్ పథకాన్ని వెంటనే పూర్తి చేసి కార్మికులకు అందించాలని కోరారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరారు.

ఆసాములకు ఉపాధి కల్పించాలి

సిరిసిల్ల రూరల్, మార్చి 16: వస్త్ర పరిశ్రలపై అధారపడి జీవిస్తున్న ఆసాములు, కార్మికులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధిని కల్పించాలని ఆసాముల సమన్వయ కమిటీ అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని భద్రావతి సంఘం అవరణలో ఆసాముల సమన్వయ కమిటీ అధ్వర్యంలో చేపట్టిన రిలేనిరహార దీక్షలు శనివారంతో 13వ రోజకు చేరుకుంది. ఈ సందర్భంగా అధ్యక్షుడు రవీందర్ మాట్లాడుతూ ఉపాధిని కల్పించాలంటూ సమ్మెచేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం స్పందించి బతుకమ్మ చీరలతోపాటు ప్రభుత్వం ఆర్డర్‌లను అందించాలని వేడుకున్నారు. దీక్షలో సభ్యులు గాజుల నరేష్, బచ్చురాములు, బూర కుమార్, పోరండ్ల శ్రీనివాస్, తెల్లభాస్కర్, చేరాల అశోక్, మండల రాజు పాల్గొన్నారు.

షరుతులు లేకుండా నిరుపేదలకు ఇళ్లు ఇవ్వాలి

సిరిసిల్ల టౌన్, మార్చి 16 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్లులేని స్థలం ఉన్న నిరుపేదలకు రూ. 5లక్షలు ఎలాంటి షరుతులు లేకుండా ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కో నియోజవకవర్గంకు 3,500 మంది ఇళ్ల నిర్మాణాలకు ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి రూ. 5లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు రూ. 6లక్షలు ఇస్తామని ప్రకటించడాన్ని సీపీఐ స్వాగతిస్తుందన్నారు. నియోజకవర్గానికి 3500 మందిలో ఎంత మంది ఎస్సీ, ఎస్టీలక ఇస్తారో.. మండలాలు, గ్రామాల వారీగా కూడా ఎంత మంది ఎస్సీ, ఎస్టీలకు ఇస్తారో ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని అర్హులకు సహాయం అందించాలన్నారు. సమావేశంలో నాయకులు మీసం లక్ష్మణ్, సోమ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా అభివృద్ధి పనులు

చందుర్తి మార్చి 16: మండలంలో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతామని జడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్ అన్నారు. చందుర్తి మండలంలోని లింగంపేట, కట్ట లింగంపేట, మూడపల్లి గ్రామాల్లో సీసీ రోడ్లు, బోరు బావి, కమ్యూనిటీ భవనాల ప్రహరీ నిర్మాణాలకు ప్రజాప్రతినిధులతో కలిసి శనివారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అభివృద్ధి పనులకు నిధుల మంజూరుకు సహకరించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు మండల ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జోగాపూర్ ఎంపీటీసీ మ్యాకల గణేష్, నాయకులు బాణాల రవీందర్‌రెడ్డి, ఆవారి రమేష్, అంజనీరావు, బండారి శేఖర్, ఏసుదాసు, ప్రసాద్, రాజు, గణేష్, ఆనంద్, రవి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

సిరిసిల్ల రూరల్, మార్చి 16: క్రీడా పోటీల్లో గెలుపు ఓటములు సహజమని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ మాజీ ఎంపీటీసీ సర్వియ సత్యేంద్రి లచ్చయ్య స్మారకార్థం అయన కుమారుడు కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ పట్టణ ప్రధాన కార్యదర్శి సత్యేంద్రి వేణుగోపాల్‌యాదవ్ ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను శనివారం కేకే మహేందర్‌రెడ్డి ప్రారంభి కీడ్రాకారులతో కలిసి క్రికెట్‌ను అడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి గంభీరావుపేట ప్రశాంత్‌గౌడ్, వార్డు అధ్యక్షుడు మంగ ప్రశాంత్, యువజన వార్డు అధ్యక్షుడు నీరటి శ్యాం, నాయకులు ర్యాకం అనిల్‌కుమార్, ఆదిపెల్లి నాగరాజుగౌడ్, తిరుపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన పీఏసీఎస్ చైర్మన్

ముస్తాబాద్, మార్చి 16: ముస్తాబాద్ మాజీ పీఏసీఎస్ చైర్మన్ కనమేని చక్రధర్‌రెడ్డి ముఖ్యమంత్రి రేంవత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని స్వగృహంలో శాలువాతో సత్కరించారు. కలిసి శనివారం శాలువాతో సత్కరించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో 17 సామాజిక వర్గాలకు కార్పొరేషన్‌లు ఏర్పాటు చేశారని చక్రధర్‌రెడ్డి పేర్కొన్నారు. రెడ్డి కార్పోరేషన్ ఏర్పాటుకు గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఉద్యమాలు చేసిన రెడ్డిలపై కేసులు నమోదు చేసిందన్నారు. రెడ్డి కార్పోరేషన్ ఏర్పాటు చేసిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

ముస్తాబాద్, మార్చి 16: మండల కేంద్రంలో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు, బోరు మోటరు,హైమాస్ట్ లైట్ల నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి మాట్లాడుతూ వంద రోజుల్లోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనదైన శైలి ముద్ర వేసుకొని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. తాగునీటి సమస్యను ఎదుర్కొనేందుకు గూడూరు, వెంకట్రావుపల్లె గ్రామాలకు బోర్,మోటారు, చీకోడ్, నామాపూర్ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొండం రాజిరెడ్డి, ప్యాక్స్ డైరెక్టర్ కొండల్‌రెడ్డి, ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, బీసీ సెల్ మండల అధ్యక్షులు శీల ప్రశాంత్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు తలారి నర్సింలు, మాజీ సర్పంచ్ ఒరగంటి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి - ఎన్నికల నిర్వహణపై నోడల్ అధికారులకు అవగాహన



కలెక్టరేట్‌లోని మానిటరింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 16: రాబోయే పార్లమెంట్ ఎన్నికలను ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం సజావుగా నిర్వహించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాబోయే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై నోడల్ అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ కేటాయిం చిన విధులను ఎటువంటి అలసత్వం వహించకుండా సంపూర్ణంగా పూర్తిచేయాలని, ఎన్నికల సందర్భంగా ఏ చిన్న పొరపాటు జరిగిన పరిణామాలు తీవ్రంగా ఉంటాయని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల విధులను సకాలంలో పూర్తిచేయాలని ఆధికారులకు సూచించారు. ప్రతీ అధికారి తనకు కేటాయించిన విధులపై అవగాహన పెంచుకొని వాటిని సమర్థవంతంగా నిర్ధేశిత సమయంలో పూర్తిచేయాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన మేర ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు పోలీసు అధికారులు, ఇతర సిబ్బంది వివరాలను జిల్లా విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణలో పాల్గొనే ప్రతీ సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలని, ఎన్నికలలో వారి బాధ్యతలు విధినిర్వహణ చేపట్టాల్సిన తీరు, ఎన్నికల కమిషన్ నిబంధనలపై సంపూర్ణ అవగాహన కల్పించేలా శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రి, స్ట్రాంగ్ రూమ్ ఇతర ఏర్పాట్లు పక్కాగా ఉండాలని అన్నారు. ఎన్నికల సందర్భంలో ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు, సెక్టార్ అధికారులు, అకౌంటింగ్ బృందాలు, వీడియో సర్వేలెన్స్ బృందాలు, ఈవీఎం యంత్రాలు, పోస్టల్ బ్యాలెట్ తరలింపు కోసం అవసరమైన మేర వాహనాలను సన్నద్ధం చేయాలని, ప్రతీ వాహనాన్ని తప్పనిసరిగా జీపీఎస్ ట్రాకర్ అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. సీవిజిల్, టోల్ ఫ్రీ నంబర్, ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదుల స్వీకరణ, వివిధ రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, సభలు, ర్యాలీల నిర్వహణకు అనుమతి దరఖాస్తుల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు.

రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో ప్రతీ ఓటరు తన ఓటు హక్కు వినియోగించుకునేలా వినూత్నంగా స్వీప్ కార్యక్రమాల నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే ఎన్నికల ప్రవర్తన నియమావళిని జిల్లాలో పక్కాగా అమలు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఎన్నికల సందర్భంగా వివిధ రాజకీయ పార్టీలు అభ్యర్థుల ప్రచార వివరాలను అకౌంటింగ్ బృందాలు పక్కాగా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల విధులు నిర్వహించే ప్రభుత్వ సిబ్బంది, 85 సంవత్సరాలు పైబడిన దరఖాస్తు చేసుకున్న ఓటర్లకు, దరఖాస్తు చేసుకున్న దివ్యాంగ ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్, ఈటీపీబీఎస్ సౌకర్యం కల్పించాలని అన్నారు. ఎన్నికల సందర్భంగా వివిధ దశల్లో జరుగుతున్న అంశాలను ప్రజలకు వివరించేందుకు పత్రిక సమావేశాలు ఏర్పాటు చేయాలని, దినపత్రికలలో ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చే పేయిడ్ వార్తలను గుర్తించి రోజువారీ నివేదిక సమర్పించాలని జిల్లా పౌర సంబంధాల అధికారిని ఆదేశించారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులందరికీ ఓటర్ జాబితాలో పేరు నమోదు అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని సిరిసిల్ల రెవెన్యూ డివిజన్ అధికారిని ఆదేశించారు. ఎన్నికల ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, అధికారుల సమన్వయంతో పనిచేసి సజావుగా పార్లమెంట్ ఎన్నికలు జరిగేలా చూడాలని పేర్కొన్నారు. అనంతరం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం, సీవిజిల్, ఎంసీఎంసీ మీడియా సెంటర్‌తో కూడిన కంప్లీట్ ఎన్‌కోర్ ఐటీ సెల్‌ను పరిశీలించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఖీమ్యా నాయక్, పూజారి గౌతమి, సిరిసిల్ల ఆర్డీవో ఎల్ రమేష్, ఎలక్షన్ నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఓటు బ్యాంక్ రాజకీయాలు చేస్తున్న బీజేపీ, బీఆర్ఎస్



మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, మార్చి 16: పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకును దెబ్బ తీయడం కోసం లిక్కర్ స్కాంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ ఆరెస్టు చేసిందని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం శివనగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమాశేంలో మహేందర్‌రెడ్డి మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులో బీఆర్ఎస్ అవినీతిలో బీజేపీకి భాగస్వామ్యం ఉందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు, నాయకులు అనేక ఆరోపణలు చేశారని అన్నారు. దేశాన్ని కుదిపేసిన లిక్కర్ స్కాంలో ఎమ్మెల్సీ కవిత అరెస్టు లోపాయకార చీకటి ఒప్పందాలలో భాగమేనని ఆరోపించారు. సంవత్సరం నుంచి లిక్కర్ స్కాం విచారణ కొనసాగుతూనే ఉందని చాలా మందిని అరెస్టు చేశారని అన్నారు. కాంగ్రెస్ ప్రజాధరణను అడ్డుకోవడం కోసం బీజేపీ ఓటు బ్యాంక్ కోసం పార్లమెంట్ ఎన్నికల ముందు కవితను అరెస్టు చేశారని ఆరోపించారు. చిత్తశుద్ధి ఉంటే మాజీ సీఎం కేసీఆర్ అవినీతిపై సీబీఐతో విచారణ జరిపించేందని విమర్శించారు. పది సంవత్సరాల కాలంలో ప్రజాస్వామ్య హక్కులు, చట్టాలను కాలరాసిన కేసీఆర్, కేటీఆర్‌కు ప్రజాస్వామ్య హక్కులు, చట్టాల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ నియోజకవర్గం క్యాంపెయిన్ కమిటీ స్టేట్ ఎగ్జిక్యూటీవ్ మెంబర్ బుర్ర రవితేజగౌడ్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వంగ మల్లేశంగౌడ్, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత అరెస్ట్‌పై బీఆర్ఎస్ నాయకుల నిరసన



సిరిసిల్లలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు, సాయికి అంటుకున్న మంటలను ఆర్పుతున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, మార్చి 16: ఎమ్మెల్సీ కవితను ఈడీ అధికారులు అక్రమంగా అరెస్ట్ చేశారంటూ బీఆర్ఎస్ శ్రేణులు జిల్లా వ్యాప్తంగా నిరసన తెలిపారు. జిల్లా క్రేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేపట్టారు. మోదీ, ఈడీ డౌన్‌డౌన్‌అంటూ నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. అనంతరం మోదీ ఫ్లెక్సీని దహనం చేసి ప్రజాప్రతినిధులు. బీఆర్ఎస్ నాయకులు నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ అరుణారాఘవరెడ్డి మాట్లాడుతూ తెలంగాణకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వస్తే వెనకాలే ఈడీ వస్తుందని మరోసారి బయటపడిందన్నారు. సుప్రీం కోర్టులో ఉన్న కేసు విచారణ పూర్తి కాకుండానే ఈడీ కవితను అక్రమంగా అరెస్టు చేయడం విచారకరమన్నారు. ఎమ్మెల్సీ కవితను విడదల చేయకుంటే రోజుకో పద్ధతిలో తెలంగాణ వ్యాప్తంగా నిరసనలు తెలుపుతామని అన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి మాట్లాడుతూ మోదీ దౌర్జన్యాలను నిలదీస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శాంతియుతంగా నిరసనలు తెలుపుతామన్నారు. కార్యక్రమంలో తోపులాట జరగడంతో ఇద్దరు మహిళ ఎంపీపీలు బహిరంగంగా గొడవపడ్డారు. ప్రజాప్రతినిధులై ఉండి కూడా చుట్టు ఎవరు ఉన్నారని కూడా చూసుకోకుండా ఇరివురు ఒకరికొకరు దుర్భాషాలాడుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, సిరిసిల్ల పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, ఎల్లారెడ్డిపేట జడ్పీటీసీ చీటి లక్ష్మణ్ రావు, ఎంపీపీలు, మానస, రేణుక, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

● దిష్టిబొమ్మ దహనంలో అపశ్రుతి..

జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టి బొమ్మ దహనంలో అపశ్రుతి చేటుచేసుకుంది. ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సందర్భంగా పెట్రోల్ సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌కు చెందిన మూడం సాయి అనే కార్యకర్తపై పడడంతో ఒక్కసారి మంటలు అంటుకున్నాయి. దీంతో సాయి పరుగులు తీయడంతో కొందరు కార్యకర్తలు వెంటనే మంటలు ఆర్పడంతో స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ప్రమాదంలో సాయి కాళ్లకు గాయాలయ్యాయి. వెంటనే జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతున్న సాయిని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి పరామర్శించారు.

వేములవాడ టౌన్: బీఆర్ఎస్ నాయకులు శనివారం పట్టణంలోని తెలంగాణ చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ చౌక్ వద్ద ధర్నా చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బండ మల్లేశం, సింగిల్‌విండో చైర్మన్‌లు రామ్మోహన్‌రావు, బండ నర్సయ్య, పార్టీ మండల అధ్యక్షుడు గొస్కుల రవి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్ల క్రాసింగ్‌లో రాస్తారోకో నిర్వహించి మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. శనివారం జిల్లెల్ల క్రాసింగ్‌లోని సిద్దిపేట-సిరిసిల్ల ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకట్రావు, ప్యాక్స్ చైర్మన్ కోడూరు భాస్కర్ గౌడ్, పూసపల్లి సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు శనివారం మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో సింగిల్‌విండో ఛైర్మన్ తిప్పని శ్రీనివాస్, నాయకులు మరాటి మల్లిక్, దప్పుల అశోక్, భైరగోని రమేష్, దుమ్ము అంజయ్య, ఈర్లపల్లి రాజు, ఏనుగుల శ్రీనివాస్, చిలుక పెంటయ్య, లక్ష్మీనారాయణ, కమలాకర్, ఇస్మాయిల్, భూమయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

ఇల్లంతకుంట: మండలంలోని పెద్దలింగాపూర్, రేపాక గ్రామాలలో అభివృద్ధి పనులకు ఎంపీటీసీలు కరివెద స్వప్న కర్ణాకర్‌రెడ్డి, కాథ సమలతమల్లేశంలు భూమిపూజలు చేశారు. పెద్దలింగాపూర్ గ్రామంలో ఓపెన్‌జిమ్, రేపాక గ్రామంలో కబ్రస్థాన్‌కు ప్రహరిగోడల నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మండల నూరుభాషా సంఘ అధ్యక్షుడు మహమ్మద్ సలావొద్దీన్, పంచాయితీ కార్యదర్శి సరస్వతి పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: కక్షసాధింపు చర్యలో భాగంగానే ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయడం జరిగిందని జడ్పీవైస్ చైర్మన్ సిద్దం వేణు పేర్కొన్నారు. ఉద్యమపార్టీ నాయకులు ఇలాంటి చర్యలకు బయపడరని పేర్కొన్నారు. ప్రతి ఎన్నికల మందు బీజేపీ ఇలాంటి చర్యలకు పాల్పడుతుందని ప్రజలు గ్రహించారని పేర్కొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బొప్పాపూర్‌లో శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు రూ.15 లక్షల ఈజీఎస్ నిధులు, జక్కుల చెరువు నీటి కాల్వ వద్ద కల్వర్టు నిర్మాణానికి రూ.5 లక్షల ప్రత్యేక నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. నారాయణపూర్‌లో ఎల్లమ్మ ఆలయం ప్రహరీ గోడ నిర్మాణానికి మంజూరైన రూ.3లక్షల ఎంపీ నిధులతో పనులకు నాయకులు శ్రీకారం చుట్టారు.

- ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలో గర్భిణీ పెద్దగంట గంగ శనివారం 108లో ప్రసవం అయింది.

సిరిసిల్ల టౌన్: ఎమ్మెల్సీ కవిత అరెస్టు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మైండ్‌గేమ్ ప్లే చేస్తుందని కాంగ్రెస్ పార్టీ క్యాంపెయిన్ కమిటి స్టేట్ ఎక్స్‌క్యూట్ మెంబర్ బుర్ర రవితేజగౌడ్ అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నోటిఫికేషన్ ముందు కవిత ఆరెస్టు చేయడం బీజేపీ, బీఆర్ఎస్ చీకటి ఒప్పందం తేట తెల్లమైందని ఆరోపించారు.

తంగళ్లపల్లి: పల్లెల ప్రగతికి కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు, ఎంపీటీసీ రాగుల రాజిరెడ్డి అన్నారు. ఎంపీ బండి సంజయ్ కుమార్ ఉపాధి హామీ పథకం ద్వారా తంగళ్లపల్లి మండలం అంకిరెడ్డిపల్లె గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణానికి రూ 12 లక్షల, ఓబులాపూర్ గ్రామంలో ఎంపీ ల్యాండ్స్ నిధులు యాదవ సంఘానికి రూ మూడు లక్షలు మంజూరు చేశారు.

సిరిసిల్ల క్రైం: సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో గల ఏ1 మొబైల్ పాయింట్‌లో శనివారం సాయంత్రం ఇద్దరు దొంగలు పథకం ప్రకారం 70 వేల రూపాయల విలువైన ఐ ఫోన్‌ను చోరీ చేసి ద్విచక్రవాహనంపై పారిపోయారు. పోలీస్‌లకు ఫిర్యాదు చేసినట్టు షాప్ యజమాని తెలిపారు.

సిరిసిల్ల టౌన్: రంజాన్ మాసం సందర్భంగా సిరిసిల్ల పట్టణం కొత్త బస్టాండ్ సమీపంలోని మదీనా మజీద్‌లో శనివారం సాయినగర్ కాంగ్రెస్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి ఇఫ్తార్ విందులో కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జి కేకే మహేందర్‌రెడ్డి హాజరైన్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గుట్టపైన నూతనంగా ఆయ్యప్ప ఆలయాన్ని నిర్మించారు. శనివారం ఆయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని నిర్వహించారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్వామి పూజలు చేశారు. ఈ సందర్భంగా పీఠాదీపతి మాధవానంద సరస్వతిస్వామి ఆశీస్సులను ఆది శ్రీనివాస్ తీసుకున్నారు.